'సింగరేణిలో రాజకీయ ఒత్తిళ్లు వద్దు'

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 10 : శ్రీరాంపూర్‌లో 108 మంది జనరల్‌మజ్దూర్ నియామకాల్లో యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్లు లేకుండా నియమించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 108 మంది జనరల్ మజ్దూర్ల నియామకాలకు సర్క్యూలర్ జారీ చేసి దరఖాస్తు తీసుకున్న సింగరేణి యాజమాన్యం మెరిట్ ఆధారంగా, అర్హులను నియమించకుండా రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతుందని ఆరోపించారు. అభ్యర్థుల లిస్టు ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించిన యాజమాన్యం వాటిని పరిగణించకుండా నియామక లిస్టు ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. నియామకాల్లో పారదర్శకత పాటించినట్లు యాజమాన్యం చెబుతూనే అనర్హులను నియమించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ నిర్వహించి నియమిస్తామని చెప్పి యాజమాన్యం కౌన్సెలింగ్ లేకుండానే ఎంపిక చేసిందన్నారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు క్వార్టర్ల అలాట్‌మెంట్, ఉద్యోగోన్నతుల కల్పన, నియామకాలు పారదర్శకంగా నిర్వహించినట్లు చెప్పా రు. కానీ యాజమాన్యం కొంత కాలంగా రాజకీయ ఒత్తిళ్లు, పైరవీకారులకు తలొగ్గి నిబంధనలు తుంగలో తొక్కి నియామకాలు చేస్తున్నారని ఆరోపించారు. జనరల్‌మజ్దూర్ల నియామకాల్లో అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పానగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

'సులభ్' కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

సీసీసీ, నస్పూర్ 10 : సింగరేణిలోని 200 మంది సులభ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సింగరేణి సులభ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఏ వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం నస్పూర్ కాలనీలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సులబ్ కార్మికుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో 200 సులభ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయని, వారికి కనీస సౌకర్యాలు, వేతనాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సులభ్ కార్మికులు ప్రమాదకర పని స్థలంలో పనిచేస్తూ అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికులకు అన్ని సంక్షేమ వసతులు కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ శ్రీనివాస్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ, ఆరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మల్లయ్య, నాయకులు మల్లేశ్, శోభ, వెంకటేశ్, నర్సయ్య, భూమయ్య, రాములు, వెంకటస్వామి, అజయ్, విజయ్, జ్యోతి, అప్పారావు పాల్గొన్నారు.

లాడ్జిపై పోలీసుల దాడి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 10 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గల టచ్ ఆసుపత్రి పక్కనున్న వేంకటేశ్వర లాడ్జిలో వ్యభిచారం నడిపిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం పట్టణ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇందులో ఆరుగురు విటులతో పాటు, నలుగురు మహిళలను పట్టుకున్నట్లు సమాచారం. ఈ విషయమై పట్టణ సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా, విచారణ చేపట్టి, బుధవారం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఈపీ ఫిట్టర్ ట్రైయినీ పరీక్షలు

రెబ్బెన, సెప్టెంబర్ 10: బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్ వద్ద మంగళవారం బెల్లంపల్లి రీజియన్ (శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలు) పరిధిలోని అండర్ గ్రౌండ్ ఫిట్టర్ ఉద్యోగులకు ఈపీ ఫిట్టర్ ట్రైయినీ ఉద్యోగోన్నతుల కోసం 17 మంది ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ తిరుపతి తెలిపారు.

నస్పూర్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 10: నస్పూర్ మున్సిపాలిటీలోని సర్వే నంబర్ 42లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతల పర్వం కొనసాగింది. నస్పూర్‌కు చెందిన పొనగోటి ప్రేమలత భర్త గోపాల్‌రావుకు సర్వే నంబర్ 40/2, 40/3లో 3.25 ఎకరాల భూమి ఉంది. ఇందులో కొంత భూమిలో ఫంక్షన్ హాలు నిర్మించుకునేందుకు మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన దరఖాస్తును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్, పక్కనే సర్వేనంబర్ 42లో టీఎన్‌జీఓఎస్‌లకు కేటాయించిన ప్రభుత్వ భూమి ఉండడంతో ఆయన రెవెన్యూ అధికారులకు క్లియరెన్స్ కోసం పంపించారు. దీంతో నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ ఈ భూమిని సర్వే చేశారు. ఇందులో దాదాపు 25 నుంచి 30గుంటల వరకు భూమి అన్యాక్రాంతమైందని నిర్ధారించి, నివేదికను మున్సిపల్ కమిషనర్‌కు పంపించారు. తహసీల్దార్ నివేదిక ఆధారంగా మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన భూమిలో నిర్మించిన ప్రహరీలు, షెడ్లు, చెట్లను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న భూమి యజమాని ప్రేమలత భర్త గోపాల్‌రావు, అతని కుమారుడు కూల్చివేతల వద్దకు చేరుకుని అధికారులను నిలదీశారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిలో కట్టడాలను కూల్చివేస్తారని అధికారులను ప్రశ్నించారు. తహసీల్దార్‌కు బాధితుడి మధ్య వాగ్వాదం జరిగింది. నోటీసులు ఇవ్వకుండా, హదులివ్వకుండా కూల్చివేయడంపై గోపాల్‌రావు.. తహసీల్దార్‌ను నిలదీశారు. తమ సర్వేలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని తేలిన తర్వాతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక వేళ తన సర్వే తప్పుగా తేలితే కూల్చివేసిన కట్టడాలను తన సొంత డబ్బులతో నిర్మించి ఇస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు. వీరి మధ్య వాదోపవాదాలు జరుగుతున్న క్రమంలో పోలీసులు జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది. సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూల్చివేత వద్ద పోలీసుల బందోబస్తు

నోటీసులివ్వకుండా కూల్చివేశారు..

నస్పూర్ సర్వేనంబర్ 40/2, 40/3లో తమకు 3ఎకరాల 25గుంటల భూమి ఉంది. ఇందులోని కొంత భూమిలో రెండు షెడ్లు నిర్మించుకోవడానికి ఈ ఏడాది మార్చిలో మున్సిపల్ అనుమతుల కోసం దరఖాస్తు చేశాము. ప్రభుత్వ ఫీజుకు కింద రూ.52 లక్షలు కట్టాలన్నారు. తక్కువ భూమిలో షెడ్లు నిర్మిస్తున్న కాబట్టి తనకు ఇంత ఫీజు కట్టాల్సిన అవసరం లేదు. దీనిపై మేము మున్సిపల్ డైరెక్టర్ వద్దకు వెళ్లాను. తాము నిర్మిస్తున్న షెడ్లకు రూ.19 లక్షలు మాత్రమే అవుతుందని చెప్పారు. ఈ విషయం మున్సిపల్ కమిషనర్‌కు చెప్పాము. రూ.52లక్షలు కట్టాల్సి ఫీజు రూ.19లక్షలకు కావడంతో తగ్గిపోయిన రూ.28లక్షల నుంచి తనకు రూ.14లక్షలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ డిమాండ్ చేశాడని గోపాల్‌రావు ఆరోపించారు. తమకు ఎలాంటి నోటీస్‌లు ఇవ్వకుండా, హద్దులు నిర్ధారించకుండా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూల్చివేయడం అన్యాయమన్నారు. ఈ విషయంపై తాను కోర్టుకు వెళ్తున్నట్లు చెప్పారు.

-పొనగోటి గోపాల్‌రావు

అక్రమమని తేల్చాకే కూల్చివేతలు

నస్పూర్ సర్వేనెంబర్ 42లో ప్రభుత్వం టీఎన్‌జీవోస్‌కు భూమి కేటాయించింది. ఈ భూమిని ఆనుకుని పొనగోటి ప్రేమలత భర్త గోపాల్‌రావు వాళ్ల భూమి ఉంది. వీరు ఫంక్షన్ హాలు నిర్మించడానికి మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకున్నారు. 42 సర్వేనెంబర్‌లోని భూమి ఇందులో కలిసి ఉంటుందనే అనుమానం రావడంతో మున్సిపల్ కమిషనర్ క్లీయరెన్స్ కోసం తన వద్దకు పంపించారు. తాము సర్వే చేసి ఇందులో 25 నుండి 30గుంటల వరకు ప్రభుత్వ భూమి ఉందని తేల్చినట్లు ఆయన తెలిపారు. తాను పంపించిన నివేదిక ప్రకారం కబ్జాకు గురైనా భూమిలో చేపట్టిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. భూమి కోర్టు పరిధిలో ఉంటే తాము కౌంటర్‌ఫైల్ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు.

- నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్

ఎన్నిసార్లు సర్వే చేస్తరు ?

డీఈ శారదతో మాట్లాడుతున్న సుంకరిపల్లి గ్రామస్తులు

భీమారం, సెప్టెంబర్ 10 : 'చెరువును ఇప్పటికి ఎన్నిసార్లు చేస్తరు. పదిసార్లు కొలిచిన్రు. కానీ, చెరువును కబ్జా నుంచి కాపాడడం లేదు..' అని ఇరిగేషన్ డీఈ శారద, ఏఈ అకిల్‌పై సుంకరిపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 30వ తేదీన భీమారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తైనేని రవి.. ఊర చెరువు సర్వే నంబర్ 570 విస్తీర్ణం, 14–39 గుంటలు, సర్వే నంబర్ 613, 614, 615 బఫర్ జోన్‌లో ఉన్నాయని, కబ్జాకు గురయ్యాయని కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండురోజులుగా అధికారులు భీమారంలో సర్వే చేస్తున్నారు. మంగళవారం డీజీపీఎస్ సాయంతో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా సర్వే చేపట్టారు. భారతీ భరోసా ఫైండర్ భారతి చెరువును కాపాడాలని గతంలో హైకోర్టులో అప్పీల్ చేశారని, అది కూడా పెండింగ్‌లోనే ఉన్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తంరెడ్డి అన్నారు. 607 సర్వే నంబర్‌లో రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి నాలా కన్వర్షన్ చేసినట్లు తెలిపారు. డీఈ శారద మాట్లాడుతూ.. నోటీసులు జారీ చేసి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. చెరువు శిఖం, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌పై సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో కలెక్టర్ భారతి హోళికేరి ఆదేశాలతో సర్వే నిర్వహించిన అధికారులు.. హద్దు రాళ్లు నిర్ణయించలేదన్నారు. 570, 602, 607, 613 సర్వే నంబర్లలో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్ఐ స్రవంతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్, సర్వేయర్లు అశోక్‌కుమార్, రామస్వామి, సుంకరిపల్లి కాలనీవాసులు, పోలంపల్లి మాజీ సర్పంచ్ డీ రమేశ్ పాల్గొన్నారు. ఎస్ఐ రాములు బందోబస్తు నిర్వహించారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

రాళ్లవాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 10 : వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని గోదావరి నది ప్రవాహం, రాళ్లవాగు ఉధృతి, ముంపు ప్రాంతమైన ఎన్టీఆర్‌నగర్‌లను పరిశీలించారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌తో కలిసి గోదావరి నదీ తీరానికి వెళ్లిన కలెక్టర్ అక్కడ నదిలో వరద పరిస్థితిని పరిశీలించారు. ఎల్లంపల్లి నుంచి ఎన్ని గేట్లు ఎత్తారని, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఎంత అని అడిగి తెలుసుకున్నారు.

40 శాతం లాభాల వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 10 : సింగరేణి లాభాల్లో నుంచి కార్మికులకు 40 శాతం వాటా ఇవ్వాలనిసింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, 50 లక్షల వడ్డీలేని గృహ రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మేనేజర్ తిరుపతికి కార్మికుల సమస్యల వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ కేంద్ర కార్యదర్శి రాజేందర్, మల్లేశ్, మహేందర్, ఫిట్ కార్యదర్శి మోతె ఓదెలు, నాయకులు పాల్గొన్నారు.

గురుకులం నుంచి విద్యార్థి పరారీ

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 10: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండలంలోని బలగల గ్రామంలో రెండు మైనార్టీ గురుకుల పాఠశాలలున్నాయి. మైనార్టీ గురుకులం బాయ్స్–1లో రెండు రోజుల క్రితం రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామానికి చెందిన 5వ తరగతి విద్యార్థి పరారీ అయ్యాడు. సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో చీకట్లో 3 కిలోమీటర్లు నడుచుకుంటూ కాగజ్‌నగర్ పట్టణంలోని అమ్మమ్మ ఇంటికి సురక్షితంగా చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి వేళలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు, గేటు వాచ్‌మెన్ నిర్లక్ష్యం కారణంగానే ఒక విద్యార్థి పారిపోయాడని ఆరోపణలు వస్తున్నాయి. పారిపోయిన విద్యార్థిని తండ్రి మంగళవారం మైనార్టీ విద్యాలయానికి తీసుకురావడంతో విషయం బయటకు పొక్కింది. ఈ విషయమై ప్రిన్సిపాల్ రుమి ప్రతిమను వివరణ కోరగా విద్యార్థి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయిన విషయం వాస్తవమేనని, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఎల్‌సీ పుష్పలతను వివరణ కోరగా మైనార్టీ గురుకులంలో విచారణ జరిపి బాధ్యులపై శాఖా పరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తమ వద్ద డబ్బులు తీసుకొని విద్యార్థులకు సీట్లు కేటాయించారని కొద్ది రోజుల క్రితం తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఇది మరువక ముందే మరో ఘటన జరిగింది. మైనార్టీ గురుకుల విద్యాలయంలోని వార్డెన్‌పై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి, నోటిఫికేషన్ ఇవ్వకుండానే విధుల్లో చేరాడని ఆరోపణతో పాటు అతనికి గతంలో సైతం మెమో జారీ చేసినట్లు తెలిసింది.

డెటాల్ తాగిన విద్యార్థిని

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 10: కాగజ్‌నగర్ పట్టణంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని ఎం. షైని మంగళవారం డెటాల్ తాగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రుద్రాంపూర్ గ్రామానికి చెందిన విద్యార్థినిపై తోటి విద్యార్థులు చేసిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కనివర్మ మందలించారు. దీంతో విద్యార్థిని మనస్తాపం చెంది డెటాల్ తాగింది. వెంటనే పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పొలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్–9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పొలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు

ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

ఏ ప్రాంతంలో ఎవరిది హవా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ అధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేష్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన థాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. థాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్‌పోల్ సర్వే పేర్కొన్నది.

లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు

ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణో దేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమాచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

తోడేళ్ల భరతం పడుతున్నారు

ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.

'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పుకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తలనొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని గ్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

సమాన అవకాశాలు ఉంటే

రిజర్వేషన్లు రద్దు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై వివాదం

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తప్పుబట్టారు. రాహుల్ మాట్లాడిన భాష ఖలిస్థానీ వేర్పాటువాది గురుత్వంత్ సింగ్ పన్నూ భాషను పోలి ఉందని ఆయన ఆరోపించారు.

సుప్రీం ఆదేశాలను ధిక్కరించి..!

- నిరసనలు కొనసాగిస్తున్న కోల్‌కతా జూనియర్ డాక్టర్లు
- చర్చలకు రావాలంటూ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానం



కోల్‌కతాలో స్వాస్థ్య భవన్ వైపు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 10: కోల్‌కతా ఆర్‌జీకర్ దవాఖాన హత్యాచార ఘటనపై నిరసన చేపడుతున్న జూనియర్ డాక్టర్లు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించారు. మంగళవారం ఐదు గంటల్లోపు విధుల్లోకి చేరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ ఆందోళన కొనసాగించారు. 32వ రోజైన మంగళవారం కూడా విధులు బహిష్కరించి తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు, సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి చర్చలకు రావాల్సిందిగా జూనియర్ డాక్టర్లను బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానించారు. దీనిని జూనియర్ డాక్టర్లు తిరస్కరించారు.

నాలుగేండ్లు ఏం చేశారు?

మలయాళ సినీ పరిశ్రమలో మహిళల వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై ఎలాంటి చర్య తీసుకోకుండా స్తబ్దుగా, నిష్క్రియాత్మకంగా ఉండటం పట్ల కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నివేదిక ఇచ్చిన నాలుగేండ్ల తర్వాత మాత్రమే చర్యలు ప్రారంభించిందని, ఇన్నాళ్లు ప్రభుత్వం ఏం చేసిందనిజస్టిస్‌లు ఏకే జయశంకరన్ నంబియార్, సీఎస్ సుధాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. వెంటనే కమిటీ పూర్తి నివేదికను (సిట్)కు అప్పగించాలని ఆదేశించింది

హేమ కమిటీతో ఆదర్శం: పినరయి

దేశంలోని ఏ రాష్ట్రం చేయని విధంగా చలన చిత్ర పరిశ్రమపై వచ్చిన ఆరోపణలపై తమ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని వేసి ఆదర్శంగా నిలిచిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు.

మహిళా అధికారిపై వింగ్ కమాండర్ లైంగిక దాడి!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణకు ఆదేశించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారత వైమానిక దళంలోని ఉన్నత అధికారిపై అత్యాచారం ఆరోపణలు జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించాయి. జమ్ముకశ్మీర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వింగ్ కమాండర్ తనపై లైంగిక దాడి చేయడమే కాక, మానసికంగా వేధిస్తున్నాడని మహిళా ఫ్లయింగ్ అధికారి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐఏఎఫ్ అంతర్గత విచారణకు ఆదేశించింది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పోలీసు స్టేషన్‌లో వింగ్ కమాండర్‌పై కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఈ ఘటన 2023, డిసెంబర్ 31న న్యూఇయర్ వేడుకల్లో జరిగింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన పార్టీలో ఆ అధికారి తన గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.

ఇజ్రాయెల్ దాడిలో 19 మంది మృతి

డెయిర్ అల్–బలాహ్, సెప్టెంబర్ 10: గాజాలోని ఓ రక్షణ గుడారంపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 19 మంది చనిపోయారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఆ గుడారంలో తల దాచుకున్న హమాస్ ఉగ్రవాదులను ఏరివేయడం కోసమే గురి చూసి ఆయుధాలతో దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. మృతుల సంఖ్యపై విభేదించింది. ఇజ్రాయెల్ ప్రకటనను హమాస్ ఖండించింది.

రష్యాకు ఇరాన్ ఆయుధాలు!

లండన్: రష్యాకు ఇరాన్ ఆయుధాలు సరఫరా చేస్తున్నదని అమెరికా, బ్రిటన్ మంగళవారం ఆరోపించాయి. ఉక్రెయిన్‌పై దాడికి ఉపయోగపడేలా ఇరాన్ స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను రష్యాకు పంపుతున్నదని పేర్కొన్నాయి. ఈ సందర్భంగా తమ దౌత్యవేత్తల కీవ్ ఉమ్మడి సందర్శనకు ముందు మాస్కో, టెహ్రాన్‌పై ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రకటించాయి. లండన్‌ను సందర్శించిన అమెరికా కార్యదర్శి ఆంటోని బ్లింకెన్ బ్రిటిష్ విదేశీ కార్యదర్శితో మాట్లాడుతూ ఇలా ఆయుధాలు సరఫరా చేయడం వల్ల సంక్షోభం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించినా ఇరాన్ లెక్కచేయలేదని అన్నారు.